నమస్తే తెలంగాణ

# నల్లగొండ



## సాగర్‌లో దాసి సుదర్శన్ చిత్రకళా నిలయం



మాట్లాడుతున్న హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు రమణారెడ్డి

నందికొండ, ఏప్రిల్ 1 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన చిత్రకారుడు, రచయిత, జాతీయ అవార్డు గ్రహీత దాసి సుదర్శన్ జ్ఞాపకార్థం రచయితలు, కళాకారులు కలిసి స్మారక చిత్రకళా నిలయాన్ని హిల్‌కాలనీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి మంగళవారం ఈ చిత్రకళా నిలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసి సుదర్శన్ కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సినీ విమర్శకుడు, కవి ప్రసేన్ బెల్లంకొండ, కార్టూనిస్ట్ నర్సిం శంకర్, కూరెళ్ల విజయ్, ఆనంద్, పున్న కృష్ణమూర్తి, పాండురంగారావు, ప్రభాకర్, హరికృష్ణ, మాజీ కౌన్సిలర్ రమేశ్‌జీ, కిరణ్మయి, అజయ్, మున్నా, ప్రసాద్, మోహన్‌రాజు పాల్గొన్నారు.



డిగ్రీ ప్రాక్టికల్ పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు నల్లగొండలోని నీలగిరి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్లు

## నేటి నుంచి జరిగే డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్స్ బహిష్కరణ!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై స్పందించని ప్రభుత్వం
- ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరసన..
- మరోవైపు జీతాలు ఇవ్వాలని విధులకు ప్రైవేట్ అధ్యాపకుల నిరాకరణ

రామగిరి/భువనగిరి అర్బన్, ఏప్రిల్ 1 : ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని గతేడాది అక్టోబర్ నుంచి ఆయా కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు దశలవారీగా ఆందోళన చేస్తున్న విషయం విదితమే. అప్పులు చేసి కళాశాలలు నిర్వహించలేమని, డిగ్రీ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు బహిష్కరిస్తామని కళాశాలల యాజమాన్యాలు ఇటీవల ఎంజీయూ వీసీకి, అధికారులకు వినతి పత్రాలు కూడా అందించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో నేటి నుంచి ఎంజీయూతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా యూనివర్సిటీల పరిధిలో నిర్వహించే డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాల వద్ద పరీక్షలు బహిష్కరిస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, నల్లగొండలోని నీలగిరి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి, కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఎంజీయూ ఫైనాన్స్ సెక్రటరీ దరిపల్లి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోవడంతో విధిలేని పక్షంలో నిర్ణయం చేశామన్నారు. ఇప్పటికే లక్షల రూపాయాలు అప్పులు చేసి అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దెలు, మున్సిపల్ ట్యాక్స్, యూనివర్సిటీ ఫీజులు చెల్లించామని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థుల వద్ద ఎలాంటి ఫీజు తీసుకోకుండా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని చదువులు చెబుతూ వచ్చామని తెలిపారు. మరో వైపు అధ్యాపకులు సైతం తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో తమ పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, లేని పక్షంలో తరగతుల నిర్వహణ, పరీక్షల విధులకు హాజరుకాబోమని భీష్మించి కూర్చున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి కళాశాలల యాజమాన్యాలను, అధ్యాపకులను ఆదుకోవాలని కోరారు. నేటి నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగనుండగా పరీక్షలు జరుగుతాయో లేదోనని విద్యార్థులు అయోమయంలో ఉన్నారు.

# కరువు కోరలు

## జిల్లాలో ఎక్కడ చూసినా ఎండిన పొలాలే..

- 20వేల ఎకరాల వరకు దెబ్బ తిన్న పంటలు
- అధికారికంగానే 4వేల ఎకరాల్లో నష్టం
- సాగు నీరు లేక అన్నదాత అగచాట్లు
- అడుగంటిన జలాలు.. ఎండిన చెరువులు, బోర్లు
- కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్లు

**యాదాద్రి భువనగిరి జిల్లాలో కరువు కోరలు చాచింది. దశాబ్ద కాలం సిరిసంపదలతో వెలుగొందిన చోట కరాళ నృత్యం చేస్తున్నది. జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయి. సాగుకు సరిపడా నీళ్లు లేకపోవడంతో పొట్ట దశలో పంటలు ఎండిపోతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా, ఎండి నెర్రెలు వారినే పొలాలే కనిపిస్తున్నాయి. రైతును కదిలించినా కన్నీటి వ్యథలే వినిపిస్తున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ)



తుక్కాపురంలో ఎండిన వరిపంటను మేస్తున్న పశువులు

### 20 వేల ఎకరాల్లో పంట నష్టం

పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు సుభిక్షంగా ఉన్నాడు. సాగు నీరు, పెట్టుబడి సాయం, ఎరువులు, మద్దతు ధర అన్నీ సవ్యంగా అందాయి. ధాన్యం కొనుగోళ్లు సైతం సజావుగా సాగాయి. కానీ, ప్రస్తుతం ప్రభుత్వ పట్టింపులేనితనంతో అన్నదాత అరిగోస తీస్తున్నాడు. నీళ్లు లేక పొట్ట దశలోనే పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలోని అధిక శాతం మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 2.8 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఎక్కువ శాతం మంది వరే వేశారు. ఇందులో ఇప్పటికే 20 వేల ఎకరాలు ఎండిపోయినట్లు తెలుస్తున్నది. అధికారికంగానే 4 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా సంస్థాన్‌నారాయణపురం, భువనగిరి, గుండాల, రాజాపేట, మోత్కూరు, చౌటుప్పల్, తుర్కపల్లితోపాటు పలు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. నీళ్లు లేపోవడంతో నేలలు నెర్రెలు బారాయి. వరి పైర్లు ఎండు గడ్డిలా మారాయి. దాంతో చేసిదిలేక రైతులు పశువులు, జీవాలను మేపుతున్నారు.

### అడుగంటిన భూగర్భ జలాలు..

జిల్లాలో కొన్నేండ్ల నుంచి భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఏటా పాతాళ గంగ పైపైకి ఉబికి వచ్చింది. నాలుగు నుంచి ఐదు మీటర్ల లోతులోనే నీటి మట్టం ఉండేది. ఈ ఏడాది మాత్రం పలు కారణాలతో భూగర్భ జలాలు వేగంగా పడిపోయాయి. జిల్లా సగటున 21 మీటర్ల లోతులో నీళ్లున్నాయి. గతానికి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండకాలానికి ముందే చెరువులు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వ పట్టింపులేమితో ఎక్కడికక్కడ ఎండిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో సగం చెరువులు అడుగంటాయి. 420కిపైగా చెరువుల్లో నీళ్లే లేవు. దాంతో భూగర్భజలాలు అడుగంటి బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు వేలు, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి బోర్లు వేసినా చుక్క నీరు పడడం లేదు. కొందరు రైతులు డబ్బులు ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీరు అందిస్తున్నారు.



ఆత్మకూరు(ఎం) : కూరెళ్లలో ఎండిపోయిన వ్యవసాయబావి

### నష్టాల ఊబిలో అన్నదాతలు

రైతులు వరి సాగుకు సుమారుగా ఎకరాకు రూ.25 వేల వరకు పట్టుబడి పెట్టారు. ఎకరాకు దాదాపు 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. క్వింటాకు రూ.2వేలు అనుకున్నా రూ. 56వేల వరకు రావాలి, ఎకరం భూమి నుంచి సరిగ్గా పంట దిగుబడి వస్తే పెట్టుబడి పోనూ రూ.33వేలు మిగులుతుంది. ఇప్పుడు పంటలు ఎండిపోవడంతో ఎకరానికి రూ.33 వేల దాకా నష్టం వాటిల్లిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

### కరువు మండలాల కోసం డిమాండ్

జిల్లాలో కరువు తాండవిస్తుండడంతో కరువు మండలాలుగా ప్రకటించాలని అనేక చోట్ల డిమాండ్ వినిపిస్తున్నాయి. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలతోపాటు రైతులు ఆందోళన, నిరసనలు చేపడుతున్నారు. కరువు మండలంగా ప్రకటిస్తే ప్రత్యేకంగా నిధులు విడుదలవుతాయి. ఫలితంగా రైతులకు ఆర్థిక సాయం అందుతుంది. తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఊరట కలిగే అవకాశం ఉంటుంది.

## ఆత్మకూరు(ఎం)లో వెయ్యెకరాల్లో ఎండిన వరి

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలంలోని 23 గ్రామాలలో 18వేల ఎకరాలలో వరిసాగు చేయగా, భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్లు ఎండిపోవడంతో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోయాయి. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చుక్కనీరు కనపడడం లేదు. ఎండిన పంటలు పశువులకు, గొర్రెలకు మేతగా మారాయి. దాదాపు ఏ గ్రామంలో చూసినా ఇలాంటి పరిస్థితే ఉంది. అధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ఆత్మకూరు(ఎం)లో ఎండిపోయిన చెక్‌డ్యామ్

### నాలుగెకరాల్లో వరి పెడితే మొత్తం ఎండిపోయింది



నాకున్న నాలుగెకరాల భూమిలో వరి నాటు పెట్టాను. ఎకరానికి 30 వేల రూపాయల లెక్కన లక్షా 20 వేల పెట్టుబడి అయ్యింది. తీరా పంట పొట్ట దశకు వచ్చే సరికి బోర్లలో నీళ్లు లేక పంటంతా ఎండిపోయింది. ఎండిన చేనును పశువుల మేతకు వదిలిపెట్టాను. ప్రభుత్వం నుంచి రైతు భరోసా డబ్బులు కూడా అందలేదు. కనీసం ఎండిపోయిన పొలాలనైనా పరిశీలించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

**- ఎలిమినేటి రంగారెడ్డి, రైతు, ఆత్మకూరు(ఎం)**

## ఇంటర్ మూల్యాంకనంలో బోర్డు అధికారి తనిఖీ

- విధుల నిర్వహణ, జవాబు పత్రాల పరిశీలన తీరుపై సీరియస్!

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రామగిరి, ఏప్రిల్ 1 : నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ మూల్యాంకనం కేంద్రాన్ని ఇంటర్ బోర్డు పరీక్షల ప్రత్యేక పరిశీలకుడు చిత్రం యాదగిరి మంగళవారం తనిఖీ చేశారు. 'ఇంటర్ మూల్యాంకనంలో ఇష్టారాజ్యం' అనే శీర్షికన మంగళవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఆయన ఇంటర్మీడియేట్ బోర్డు అధికారుల ఆదేశాలతో వచ్చారు. దీనిలో భాగంగా డీఐఈఓ దస్రూనాయక్‌తోపాటు వాల్యూకేషన్ కేంద్రం అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్(ఏసీఓ), సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (ఎస్ఈ)లతో సుమారు రెండు గంటలకుపైగా ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. విధుల్లో ఉన్న ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని మందలించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు మూల్యాకంనం చేసిన జవాబు పత్రాల వివరాలను సబ్జెక్టు వారీగా తెలుసుకోవడంతోపాటు ఎక్కడ ఎలాంటి తప్పులు జరుగవద్దని సూచించినట్లు సమాచారం. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన పత్రాలను పరిశీలించి, తప్పులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేపర్లను ఇష్టారాజ్యంగా పరిశీలించకుండా వ్యవహరిస్తే మూల్యాంకనంలో తప్పులు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

ఈ విషయంపై డీఐఈఓ దస్రూనాయక్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా సాధారణ తనిఖీలో భాగంగానే వచ్చారని, స్పాట్‌లో అందరూ సక్రమంగానే పని చేస్తున్నారని, సీసీ కెమెరాతో పరిశీలిస్తున్నామని, కొంత మంది అధ్యాపకులు అసత్య తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తోసిపుచ్చే సమాధానం చెప్పారు.

## రాజాపేటలో రైతుల అరిగోస

- అడుగంటిన నీటి వనరులు
- బోర్లు పొయ్యక ఎండుతున్న పంటలు
- గోదావరి నీళ్లతో చెరువులు నింపాలంటున్న రైతులు



రాజాపేటలో ఎండిన వరి పంటలో మేస్తున్న పశువులు

రాజాపేట : రాజాపేట మండల వ్యాప్తంగా 13 చెరువులు, 33 కుంటలు ఎండిపోయాయి. దాంతో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నాయి. ఎండలు కూడా దంచి కొట్టుతుండడంతో బోర్లు నీళ్లు పోయడం లేదు. ఆగి ఆగి పోస్తున్నవి సైతం ఎటూ చాలడం లేదు. మండలంలో ఎక్కడ చూసినా కరువు చాయలు కన్పిస్తున్నాయి. యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడిని ఊహించిన రైతులు వరి సాగు గణనీయంగా తగ్గించారు. గతంలో 22వేల ఎకరాల్లో వరి నాటు పెట్టగా, ఈసారి 16 వేల ఎకరాల్లోనే వేశారు. అయినా ఇప్పటికే 20 శాతానికిపైగా పంటలు ఎండి పోయాయి. పొట్ట దశలో ఎండిన పంటలు పశువులు, జీవాల మేతగా మారుతున్నాయి. ఇంకో 15 రోజులు నీరు అందిస్తే పంట చేతికి వచ్చేదని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు పెట్టుబడి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో కూడా తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు.

### నాలుగెకరాలు పశువుల పాలే అయ్యింది



నా పొలం వాగు పక్కనే ఉంటుంది. గతంలో ఎండ కాలంలోనూ వాగులో నీళ్లు ఉండేవి. ఈ సారి పూర్తిగా ఎండిపోయింది. గత యాసంగిలో పదెకరాలు నాటు పెడితే ఈసారి నాలుగెకరాలే సాగు చేశాను. నాలుగు బోర్లు ఉంటే ఒక్కటీ నీళ్లు పోయడం లేదు. పంటంతా ఎండిపోయింది. ఎండిన చేనును పశువుల మేతకు వదిలిపెట్టాల్సి వచ్చింది.

**-గౌర యాదయ్య, రైతు పారుపల్లి, రాజాపేట మండలం**

### 700 ఫీట్లు బోరు వేసినా నీళ్లు పడట్లే



ప్రభుత్వం గోదావరి జలాలతో గొలుసు కట్టు చెరువులను నింపాలి. రాజాపేట మండలంలో భూగర్భ జలాలు ఘోరంగా పడిపోయాయి. 700 ఫీట్ల లోతు బోరు వేసినా నీళ్లు పడడం లేదు. పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎమ్మెల్యే పట్టించుకోని కాళేశ్వరం వచ్చే నీళ్లతో మల్లగూడెం, రెడ్డిచెరువులను నింపి గొలుసుకట్టు చెరువులన్నింటికీ నీళ్లు ఇవ్వాలి.

**-ఎర్రగోకుల జశ్వంత్, రాజాపేట మండల జల సాధన సమితి కన్వీనర్**

## సన్నబియ్యం పంపిణీలో కాంగ్రెస్ వర్గాల ఘర్షణ



మునగాల మండలం రేపాలలో గొడవ పడుతున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల, ఏప్రిల్ 1 : మునగాల మండలం రేపాల గ్రామంలో మంగళవారం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవంలో ఘర్షణ నెలకొంది. కొబ్బరి కాయ కొట్టేందుకు పాత, కొత్త కాంగ్రెస్ నాయకులు పోటీపడడంతో గొడవ ఏర్పడింది. ఫొటోల కోసం తాము ముందు కొడతామని తాపత్రయ పడడం, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి కొత్తగా వచ్చిన వారు ఉండడంతో ఒకరికొకరు నెట్టుకోవడంతోపాటు దూషించుకున్నారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొం ది. కాంగ్రెస్ నాయకుల గొడవ పడుతుండడంతో బియ్యం కోసం వచ్చిన ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## హెచ్‌సీయూ భూముల రక్షణకు ఉద్యమిస్తాం

రామగిరి, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను రక్షించేందుకు ఉద్యమిస్తామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ అన్నారు. హెచ్‌సీయూ భూములను రక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంజీయూ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా యూనివర్సిటీ భూములను లాక్కుంటున్నదని విమర్శించారు. హెచ్‌సీయూ భూములు విద్యార్థుల భవిష్యత్తు కోసం, విద్యా పరిశోధనలకు కేటాయించిన భూములను వ్యాపార ప్రయోజనాల కోసం లాక్కునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జనంపల్లి జాన్‌ప్రేమ్, పాక రవి, మాచర్ల సుధీర్, వాడపల్లి నవీన్, రవి, తరుణ్, కోటి, ముఖేశ్ పాల్గొన్నారు.




ఎంజీయూ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ నాయకులు

# ప్రజాపాలనలో దమనకాండ

- హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని నిరసిస్తే అరెస్టులు
- బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకుల నిర్బంధం

సూర్యాపేట, మే 1 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రతిపక్షాలపై నిర్బంధకాండ కొనసాగుతున్నది.

పలు సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు, కార్యకర్తలను నిర్బంధం చేసి అడ్డుకుంటున్నది. ప్రజాస్వామ్యంగా ఆందోళనలు, నిరసనలు చేయకుండా అరెస్టులు చేస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం తెగనమ్మేందుకు కుట్రలు చేస్తుండగా అడ్డుకుంటున్న ప్రతిపక్ష నాయకులపై తిరుగబడుతున్నది. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం మంగళవారం బీఆర్ఎస్వీ, సీపీఎం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర సంఘాల నాయకులను హైదరాబాద్‌లో హెచ్‌సీయూ వద్దకు వెళ్లనివ్వకుండా నిర్బంధించింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. సోమవారం రాత్రి నుంచే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట జిల్లాలో పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్, అర్వపల్లి, తిరుమలగిరి, చిలుకూరు, నాగారం, పాలకవీడు, కోదాడ, మేళ్లచెర్వు, తుంగతుర్తి, హుజూర్‌నగర్.. నల్లగొండ జిల్లాలో తిప్పర్తి, మునుగోడు, దేవరకొండ, నార్కట్‌పల్లి, తిరుమలగిరి సాగర్, కేతేపల్లి, శాలిగౌరారం, దామరచర్ల, చిట్యాల.. యాదాద్రి భువనగిరి జిల్లాలో మోత్కూరు, రామన్నపేట, ఆత్మకూర్.ఎం, మోటకొండూరు, భువనగిరి, వలిగొండ, భూదాన్‌పోచంపల్లిలో నాయకులను అరెస్టు చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల ప్రభుత్వ భూముల వేలాన్ని ఆపాలని, భూముల అమ్మడం ద్వారా సమకూర్చుకోవాలని చేసే ఆలోచన మంచిది కాదని నాయకులు అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేసి భయభ్రాంతుకుల గురి చేయడం తగదని, అక్రమ అరెస్టులకు భయపడేది లేదని హెచ్చరించారు.



మోత్కూరులో బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



అర్వపల్లిలో పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు




ఆత్మకూర్ (ఎస్) : అరెస్టు అయిన సీపీఎం నాయకులు



చందంపేట (దేవరకొండ) : బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు